🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
✆ : 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 | సంచిక : 20 | 12-02-2024 | పుటలు : 4

## సమాజంపట్ల బాధ్యతగా వ్యవహరించాలి



**08.02.24 (మీడియాసెల్)**

విద్యార్థులు, అధ్యాపకులు విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, సమాజహితంగా జీవించాలని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. గురువారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్ థ్రో ఎడ్యుకేషన్ బి.సి.డి.ఈ అనే అంశంపై వర్క్ షాప్ ను నిర్వహించారు.ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణ కళాశాలలతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల నుండి బి.సి.డి.ఈ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య కె.పద్మరాజు హాజరై బి.సి.డి.ఈ ప్రోగ్రామ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బి.సి.డి.ఈ కాలేజ్ కోఆర్డినేటర్లు మరియు స్టూడెంట్ అంబాసిడర్స్ కు అవగాహన కల్పించి విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యవతను ప్రభుత్వంలో భాగస్వామ్యం చేసి సమాజహితమైన కార్యక్రమాలు నిర్వహించడం ప్రధాన లక్ష్యంతో బి.సి.డి.ఈ పని చేస్తుందన్నారు. ఇటీవల కాలంలో ఉన్నత విద్యలో ప్రవేశపెట్టిన కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుకు అవసరమైన వనరులను, అంశాలను విద్యార్థి లోకానికి పరిచయం చేయడానికి మరియు ఆయా అంశాలపై పూర్తి అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. బి.సి.డి.ఈ సెక్రటరీ, సీఈఓ ఆచార్య ఎం.ఎల్.ఎస్.దేవకుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలకు అన్ని రాష్ట్రాలకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలనే కనీస బాధ్యతగా ఉన్న రోజుల్లో అత్యధికంగా యువత ఉన్న మన దేశానికి మరింత బాధ్యత ఉందన్నారు. ఉన్నత విద్యలో భాగస్తులైన విద్యార్థులందరికీ సుస్థిరాభివృద్ధి సాధించడానికి బి.సి.డి.ఈ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బి.సి.డి.ఈ కన్సల్టెంట్ కె.సిమ్రాన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు విద్యార్థులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వివిధ లక్ష్యాలతో ముందుకు సాగుతున్న తరుణంలో విద్యార్థులు తమవంతు సహకారాన్ని అందించి ఆంధ్రప్రదేశ్ ను అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనడం ద్వారా సమాజ పరిస్థితులు, సృజనాత్మక ఆలోచనలు వెలుగులోనికి వస్తాయని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బి.సి.డి.ఈ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డా.బి.జగన్మోహనరెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయం, బయోకల్చర్ తయారీపై రెండురోజుల శిక్షణ,కార్యశాల



కృషి విజ్ఞాన కేంద్రం కలవచర్ల వారి సౌజన్యంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వృక్షశాస్త్ర విభాగపు సువాస – ది స్టూడెంట్ క్లబ్ తరపున విశ్వవిద్యాలయం విద్యార్థులకు రెండురోజుల ప్రకృతి వ్యవసాయం,బయో కల్చర్ తయారీపై శిక్షణ, వర్క్షాప్ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ కె.పద్మరాజు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం కలవచర్ల హెడ్ డా. వి.ఎస్.జి.ఆర్. నాయుడు, ఆదికవి నన్నయ యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగపు అధ్యాపకులు డా. వి.పద్మావతి, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, కోర్స్ కోఆర్డినేటర్ కె.శ్యామ్యూల్ కుమార్, డా.ఎల్ ముత్యాలనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి యస్. మాధవరావు, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజర్ నాచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బి. తాతారావు తదితరులు పాల్గొన్నారు.డా. వి.ఎస్.జి.ఆర్ నాయుడు, హెడ్, కేవీకే, కలవచర్ల మాట్లాడుతూ విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం మరియు నేలను సంరక్షించుకోవడం వంటి అంశాలపై అవగాహన, శిక్షణ మరియు ప్రదర్శన ఈ కార్యక్రమం ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు.ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ కే పద్మరాజు మాట్లాడుతూ కేవీకే వారి సహకారంతో భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయం సూత్రాలు, బయో కల్చర్స్ తయారీపై యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగం దృష్టి సారించాలని యూనివర్సిటీ ప్రాంగణంలోనే విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ ప్రకృతి వ్యవసాయంపై కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. విద్యార్థులు కేవలం ఐటీ రంగంపై ఆధారపడకుండా ప్రకృతి మరియు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఫుడ్ ప్రాసెసింగ్ పై దృష్టి సారించాలని కోరారు.డా. వి. పద్మావతి మాట్లాడుతూ కేవీకే కలవచర్ల వారి ఆర్థిక సౌజన్యంతో చాలా విశిష్టమైన శిక్షణా కార్యక్రమాన్ని ప్రత్యేకంగా విద్యార్థుల కొరకు చేపట్టడం జరిగిందని తెలిపారు. SUVASA-THE STUDENT CLUB కార్యక్రమాల్ని ఈ సందర్భంగా వివరించారు.జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు మరియు APCNF జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి. తాతారావు మాట్లాడుతూ జిల్లాలో 18 మండలాలలో సుమారు 30 వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టారని తెలిపారు. ముఖ్యంగా పంట పోషణకు, పంట రక్షణకు సంబంధించిన 22 రకాల బయో కల్చర్స్ ను ఏ విధంగా తయారు చేసుకోవాలో ప్రదర్శనగా చూపించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కెవికె అధికారులు జే.వి.ఆర్.సత్యవాణి, దిలీప్, విజయవర్ధన్, ప్రభాత్ నాయుడు, ఎం.ఏ.రాజు, రత్నాజీ, విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీ గౌరీ పార్వతి, లిఖిత, APCNF సభ్యులు, రైతులు పాల్గొన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె పద్మరాజు గారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐ.సి.ఏ. ఆర్ సి.టి.ఆర్.ఐ డైరెక్టర్ డా. ఎం శేషు మాధవ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# సంపాదకీయం



## ప్రేమ

నీ విద్యుక్తధర్మాన్ని నీవు నిర్వర్తించటమే ప్రేమ అన్నాడో పెద్దమనిషి.ప్రేమిస్తే పోయేదేమీ లేదు.మహా అయితే తిరిగి ప్రేమిస్తారంతేనంటారో సినిమాకవి.

పుష్కలమైన ప్రాణవాయువు, కడుపునిండా భోజనం, బ్రతకటానికి కావలసిన సౌకర్యాలు, ధనం... ఉన్నంత మాత్రాన ఏ వ్యక్తి జీవితం కూడా పరిపూర్ణం కాదు.అవన్నీ సమకూరితే చాలా కాలం బతికేస్తాం అంతే!జీవించాలంటే మాత్రం, జీవితాన్ని ఆస్వాదించాలంటే మాత్రం ప్రేమ ఉండాల్సిందే. మనల్ని ప్రేమించే వాళ్ళు, మన చేత ప్రేమింపబడే వాళ్ళు ఉండాలి. అమ్మ,నాన్న,గురువులు,అన్న, తమ్ముడు, అక్క,చెల్లెలు,భార్య, భర్త, స్నేహితులు....ఇలా కొంతమంది ఉండాలి.లేదంటే 'దేశమును ప్రేమించుమన్నా'అన్నారు గురజాడ వారు.అదైనా ఉండాలి.దేశమంటే మనుషులే కదా!

ఎవరికి వారు పాడుకునే పాటలాంటిది ప్రేమంటే.చుట్టుపక్కల వారికి అది ఆనందం కలిగించకపోవచ్చు.కానీ ఎవరిపాట వారికి మధురంగానే ఉంటుంది.ఈ ప్రపంచానికి మనం ఒక సాధారణమైన వ్యక్తి కావచ్చు.కానీ మనల్ని అభిమానించి,ప్రేమించే వ్యక్తులకు మాత్రం మనమే ప్రపంచం.

ఒకరిచేతి రాతను మళ్లీమళ్లీ చదువుతున్నా, ఒకరి కంఠస్వరాన్ని విన్నప్పుడు మళ్ళీ వినాలనే కోరిక కలుగుతున్నా, ఒకరి గురించి చెబుతున్నప్పుడు మనసు ఆనందం పొంది చిరునవ్వు కదలాడినా వారిని మీరు అభిమానిస్తున్నారని అర్థం. ఇదే అమలిన ప్రేమ సిద్ధాంతం. మలినం లేని స్వచ్ఛమైన ప్రేమ. ఈ సిద్ధాంత వేదిక మీదనే రాయప్రోలు సుబ్బారావుగారు తృణకంకణం కావ్యం రాశారు కూడా.

మానవుడు సంఘజీవి అన్నారు అరిస్టాటిల్. అంతే కాదు మానవుడు బుద్ధిజీవో, డబ్బు జీవో మాత్రమే కాదు. ప్రాథమికంగా ప్రేమజీవి. ప్రేమ లేకపోతే బ్రతకలేడు. తనను ప్రేమించే వాళ్ళు కావాలి, లేదా తాను ప్రేమించే వాళ్ళు ఉండాలి.ఎవరూ ప్రేమించటం,అభిమానించటం లేదంటే అటువంటి ఊహ భరించలేం కూడా.

కరడుగట్టి నేర ప్రవృత్తి కలిగిన మనిషి సహచరి అనురాగంతో మంచి మనిషిగా మారిపోవటం, సామాన్యుడైన వ్యక్తి ప్రేయసి చొరవతో గొప్పవాడు కావటం.... ఇటువంటి కథలు పుస్తకాల్లో, సినిమాల్లో చూస్తూ ఉంటాం. మరి ఆ మాటకొస్తే రామాయణంలో సీతాస్వయంవర ఘట్టంలో శివధనుస్సును ఎక్కుపెడుతూ శ్రీరామునికి ఇది ఎత్తగలనా అని ఏమూలనో కొద్దిపాటి అపనమ్మకం కలిగితే సీత అందమైన వాలుజడ గుర్తుకొచ్చి ఇదే సాధించలేకపోతే రేపు అంతజడను పట్టుకొని సరసాలేం ఆడగలనని అనుకున్నాడట! ఎక్కడలేని శక్తి ఆయనలో ప్రవేశించి శివునివిల్లు ఫెళ్ళున విరిగి రామకథ ప్రేమకథగా మారిందట! ఇటువంటి సంఘటనలు భలే ఉంటాయి.కవుల చమత్కారం సరదా అనిపిస్తుంది. ఇటువంటివన్నీ కూడా మనిషిలోని ప్రేమను పుట్టించేందుకే!ప్రేమను పండించేందుకే!!ం

## వీసీ పద్మరాజును సన్మానించిన ఏయూ వీసీ ప్రసాదరెడ్డి




ఏపీ సెట్ స్టీరింగ్ కమిటీ సభ్యునిగా నామినేట్ అయిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె. పద్మరాజును ఆంధ్ర యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి అభినందించారు. ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన ఏపీ సెట్(AP SET) స్టీరింగ్ కమిటీ సభ్యుల సమావేశానికి హాజరైన ఆచార్య కె. పద్మరాజును ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులుగా, వివిధ కమిటీల్లో సభ్యులుగా బాధ్యతలు నిర్వహించి విశేష అనుభవాన్ని సంపాదించుకున్నారని అభినందించారు.

## ఎన్ఎస్ఎస్ స్వచ్ఛభారత్ ప్రోగ్రాం



స్వచ్ఛభారత్ లో భాగంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ మూడవ యూనిట్ వాలంటీర్లు ఎన్ బ్లాక్ లో స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ బ్లాక్ పరిధిలో ఉన్న వివిధ రకాలైన కలుపు మొక్కలను తీసివేసి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ మూడవ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.ఎల్.ముత్యాలనాయుడు మరియు ప్రిన్సిపల్ డా.పి. విజయనిర్మల పాల్గొన్నారు.

## జాతీయ బాలికల దినోత్సవం

దివాన్ చెరువులో శ్రీ దూడల సూరన్న మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు, అందులో ఆడపిల్లకి చదువు, వారికి ప్రభుత్వరంగ సంస్థలు అవకాశాలు గురించి, భేటీ బచావో భేటీ పడవో గురించి వారికి వివరించారు. వాలంటీర్స్ వై.బిందు మాధవీ, స్వామి, దత్తాత్రేయ, సుప్రజ, రమాదేవి, శ్రీవిద్యలకు ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల ధన్యవాదాలు తెలిపారు. స్కూల్ ఇన్ చార్జీ హెచ్.ఎం. శ్రీనివాసశర్మ మరియు ఇంగ్లీష్ టీచర్ కృపామణి పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ పి.ఓ. డా.ఎస్. రాజ్యలక్ష్మి కార్యక్రమాన్ని నిర్వహించారు.





ప్రేమంటే కళ్ళు మిరుమిట్లు
గొలిపే ప్రవాహం కాదు.
నిత్యం ప్రవహించాల్సిన
జీవధార!
పుట్టిన మనిషి చేయగలిగే
పుణ్యకార్యం!
మరణం దాకా నిలుపుకోగలిగే
మహత్వం!!

## మంచిమాట

బుద్ధిగా ప్రేమించుకోక... యుద్ధాలెందుకు
చేసుకుంటున్నారో
నాకర్థంకావటం లేదు!!
- ఇస్మాయిల్







# జాతీయస్థాయి ఆదివాసి సాంస్కృతిక మహోత్సవాలు




**05.02.24 (మీడియాసెల్)**

సంస్కృతి ,సంప్రదాయాలు ,సంస్కారాలు గిరిజన వారసత్వ సంపదని,వాటిని వారి నుంచి నేర్చుకోవాలని ,ఆరోగ్య జీవనం ఆదివాసీల సొంతమని నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. సోమవారం నన్నయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యంలో టీ.ఎస్.ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.మల్లి భాస్కర్ అధ్యక్షతన జరిగిన గిరిజన సాంస్కృతిక మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైస్సార్సీపీ సిజిసి మెంబర్ జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు,కళలతోనే సమాజ వికాసం ఉంటుందని అందుకే తనకు చిన్నతనం నుంచే కళలంటే ఇష్టమని అన్నారు. ఈ సందర్భంగా ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్ప నాయక్,రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్ప,రాష్ట్ర కార్యదర్శి విష్ణు నాయక్ మాట్లాడుతూ నేటికీ గిరిజనులు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నారని, గిరిజన సాంస్కృతిక, సంప్రదాయాలు భారత దేశానికి పట్టుకొమ్మలని,గిరిజన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఎంతైనా ఉందని అన్నారు. అనంతరం విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.విజయనిర్మల మాట్లాడుతూ విద్యతోనే పేదరికాన్ని జయించడం సాధ్యమని, గిరిజనులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గిరిజన సంప్రదాయ నృత్యరీతుల్ని ప్రదర్శించారు. టీఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ నాయక్ ,మాజీ టీఎస్ఎఫ్ నాయకులు దొర, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజకుమార్ రెడ్డి, రాష్ట్ర నాయకులు భగవాన్, వెస్లీ, రఘు, రామరాజు, వెంకటేష్, వెంకటేశ్వర్లు నాయక్,రఘునాథ్ నాయక్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.













# వాలెంటైన్



క్రీ.శ. 269 – 70 ప్రాంతంలో రోమన్ సామ్రాజ్యాన్ని రెండవ క్లాడియస్ పాలించేవాడు. స్వల్ప కాలంలోనే తన స్వభావంతో క్రూర క్లాడియస్ అనే అపకీర్తి మూటకట్టుకున్నాడు.అతనికి రాజకీయ సామ్రాజ్య విస్తరణ కాంక్ష ఎక్కువ. అందుకే సైన్యం నిత్యం యుద్ధం చేయాల్సి వచ్చేది. ఏడాది పొడవున యుద్ధభూమిలో ఉండటం వల్ల సైన్యంలో పనిచేసే వారి జీవితాలు మరి ఘోరంగా తయారయ్యాయి. దానితో యువకులు అటువైపు ఆసక్తి చూపడం మానేశారు. ఫలితంగా సైన్యంలో పనిచేసే వారి సంఖ్య తగ్గిపోయింది. దేశంలోని యువకులు తమ కుటుంబాల్ని విడిచి రావడానికి ఇష్టపడకపోవటమే సైనికుల కొరతకు కారణమని భావించిన క్లాడియస్ దేశంలో నిశ్చితార్థాలు, పెళ్లిళ్ల పైన ఆంక్షలు పెడుతూవచ్చాడు.యువకులు తమ ప్రియురాళ్ళకు దూరంగా ఉంటూ విరహవేదనను పొందేవారు. రాజును ఎదిరించే ధైర్యం కూడా ఎవరికి లేకపోయింది.

ఆ సమయంలో వాలెంటైన్ అనే మత బోధకుడు ప్రేమికులకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని అంగీకరించలేకపోయాడు. యువకులకు ప్రత్యేకించి సైనికులకు రహస్యంగా పెళ్లిళ్లు చేసేవాడు. ఆ విషయం క్రమంగా బయటకు తెలిసింది. చివరకు క్లాడియస్ చెవిలో పడింది. కోపోద్రిక్తుడైన గ్లాడియస్ వాలంటైన్ ని బంధించి జైల్లో పెట్టించాడు. ఆపైన ఉరి తీయమని ఆదేశించాడు. కారాగారంలో ఉండగా జైలు అధికారి కుమార్తెతో ప్రేమలో పడ్డాడు వాలంటైన్. అంధురాలైన ఆమెకు చూపు రావాలని రోజూ ప్రార్థించేవాడు. ఉరి తీయటానికి ముందు రోజు తన ప్రేమను తెలుపుతూ గోడపైన లేఖ రాస్తూ చివరిగా ఫ్రమ్ యువర్ వాలంటైన్ అని రాశాడు. అదే అతని చివరి మాట.

ఆమెకు ఆ తర్వాత చూపు వచ్చి ఆ మాటల్ని చదవగలిగిందని చెబుతారు. వాలంటైన్ చనిపోయిన తర్వాత కూడా అనేక తరాల వారు ఆయన గురించి కథలుగా చెప్పుకునేవారు. తర్వాత రెండు శతాబ్దాలకు కేథలిక్ చర్చి ఆయనకు సెయింట్ బిరుదునిచ్చింది. ఆయన మరణించిన రోజు ఫిబ్రవరి 14న ఒక పండుగలా చేసుకోమని ప్రకటించింది. నాటి నుంచి వాలెంటైన్ ప్రేమికులకు ఆరాధ్యుడయ్యాడు.

## ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె పద్మరాజును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రముఖులు.



ప్రొఫెసర్. దేవ కుమార్, బి.సి.డి.ఇ- సీఈవో



పి. రాజు ఐటిఎస్ బిఎస్ఎన్ఎల్-జనరల్ మేనేజర్



జి. ఆదిత్య,సీనియర్ మేనేజర్ (కొటక్ మహీంద్ర బ్యాంక్ )



ప్రొఫెసర్. విజయ్ మోహన్ (డైరెక్టర్ అఫ్ పిజికల్ ఎడ్యుకేషన్, ఆంధ్ర యూనివర్సిటీ )

## గోదావరి బాలోత్సవంలో నన్నయ విద్యార్థుల సేవలకు ప్రశంసలు



బాలోత్సవంలో ప్రసంగిస్తున్న ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య వై. శ్రీనివాసరావు

గోదావరి బాలోత్సవం రెండవ పిల్లల పండుగలో సేవలందించిన నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల విద్యార్థులు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య వై. శ్రీనివాసరావు ప్రశంసించారు. రాజమండ్రి ఎస్ కె వి టి డిగ్రీ కళాశాలలో శని, ఆదివారాల్లో గోదావరి బాలోత్సవం పిల్లల పండగ అంగరంగ వైభవంగా జరిగింది. ఆరు మండలాల నుండి విచ్చేసిన వేలమంది విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ అకాడమిక్ మరియు కల్చలర్స్ కార్యక్రమాలలో







జడ్జెస్ కు, కార్యక్రమ నిర్వాహకులకు సహకారులుగా ఉంటూ వాలంటీర్లు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలైన శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ విద్యాశిక్షణా కళాశాల నుండి 80 మంది విద్యార్థులు, ఆదిత్య కాలేజ్ నుండి 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, రాజమహేంద్రి కాలేజ్ నుండి 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఈ బాలోత్సవంలో సేవలందించారు. విశ్వవిద్యాలయ అధికారులకు, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ కు, ప్రోగ్రాం ఆఫీసర్లకు విద్యార్థులకు గోదావరి బాలోత్సవం అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.ఎస్.ఎస్ కృష్ణకుమార్,ప్రధాన కార్యదర్శి పిఎస్ఎన్ రాజు,నిర్వహణ కార్యదర్శి పి. తులసి అభినందనలు తెలియజేశారు.ఆయా కార్యక్రమాల్లో న్యాయ నిర్ణేతలుగా విశ్వవిద్యాలయ తెలుగుశాఖ అధ్యాపకులు డా.తలారి వాసు,కూచిపూడి డిప్లమో కోర్స్ కోఆర్డినేటర్ డా.కె. రాజరాజేశ్వరిదేవి, పి.ఆర్.ఓ పి.ఆనంద్ వ్యవహరించారు.



విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

# డార్విన్ డే

## (ఫిబ్రవరి 12)




మానవ పరిణామం ఎలా జరిగిందో తెలియజేసిన ప్రముఖ శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ 1809 ఫిబ్రవరి 12న ఇంగ్లాండ్ లో జన్మించారు.
చార్లెస్ డార్విన్ తల్లిదండ్రులు రాబర్ట్ డార్విన్,సుశాన్ డార్విన్ ప్రసిద్ధ వైద్యులు.చిన్నప్పటి నుంచి డార్విన్ కు చదువుపై ఆసక్తి లేకపోవడంతో డార్విన్ తల్లిదండ్రులు ఎంతో బాధపడేవారు.
ఇవేవీ పట్టించుకోని డార్విన్ అసలు భూమిపై జీవం ఎలా వచ్చిందో తెలుసుకోవడానికి నిరంతరం ప్రయత్నించేవారు.
డార్విన్ కు 22 ఏళ్ల వయసులో 1831 డిసెంబర్ నుండి 1836 వరకు 'బీగల్' అనే ఓడ ద్వారా ఐదేళ్లపాటు సుదీర్ఘ యాత్ర చేసి,నాలుగు ఖండాలను సందర్శించి అనేక శిలాజాలపై,మొక్కలపై, జంతువులపై పరిశోధన చేశారు.అంతేకాకుండా అనేక మొక్కలు,రాళ్లు,కీటకాల నమూనాలను సేకరించి చాలా సంవత్సరాలు పాటు పరిశోధన చేసిన తర్వాత భూమిపై 'అన్ని జాతులకు ప్రాథమికంగా ఒక జాతి మూలం' అని తెలియజేశారు.
1859 నవంబర్ 24న చార్లెస్ డార్విన్ "ఆన్ ఆరిజన్ ఆఫ్ స్పీసెస్" అనే పుస్తకాన్ని ప్రచురించి బలమైన ఆధారాలతో 'జీవ పరిణామ సిద్ధాంతాన్ని' నిరూపించారు.
ఈ పుస్తకంలో 'థియరీ ఆఫ్ ఎవల్యూషన్' అనే అధ్యాయంలో మనుషులు కోతుల నుంచి ఎలా ఉద్భవించారో వెల్లడించారు.మన పూర్వీకులు కోతులని, అవి వేరువేరు ప్రదేశాల్లో..వేరువేరుగా జీవించడం వలన వాటిలో వచ్చిన మార్పులే మనుషుల పుట్టుకకు కారణమని పేర్కొన్నారు.ఈ సిద్ధాంతం వలన డార్విన్ ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందాడు.
డార్విన్ తన 74 ఏండ్ల వయసులో 1882లో చనిపోయారు.సర్ ఐజాక్ న్యూటన్ సమాధి పక్కనే ఈయన్ని కూడా సమాధి చేయడం జరిగింది.
ఎంతోమంది భౌతిక, జీవ శాస్త్రవేత్తలపై ప్రభావం చూపించిన ఆయన రచన "ది ఆరిజన్ ఆఫ్ స్పీచెస్" 1997 లో ప్రచురణ 50వ వార్షికోత్సవం సందర్భంగా న్యూయార్క్ సిటీ కాలేజ్ ప్రొఫెసర్ అయిన మాసియో పిగ్లియోచి ఫిబ్రవరి 12న డార్విన్ డే జరుపుకోవాలని ప్రతిపాదించడం జరిగింది.డార్విన్ ఈనాడు లేకపోయినా ఆయన ప్రతిపాదించిన 'ప్రకృతివరణ సిద్ధాంతం' ఎప్పటికీ నిలిచే ఉంటుంది.

– బి.సుశాంత్

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in